RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం , అక్టోబర్ 11 , 2026

# పూల పండుగ నుంచి తెలంగాణ అస్తిత్వ ప్రతీకగా బతుకమ్మ

**- ప్రకృతిని ఆరాధించే సంప్రదాయం.. మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక**

**- టేకులపల్లి, గోలియ తండాలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు**





**టేకులపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పల్లెల్లో సందడి నింపుతోంది. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలను పేర్చి గౌరమ్మను పూజిస్తూ మహిళలు జరుపుకునే ఈ వేడుక కేవలం పండుగ మాత్రమే కాదు.. ప్రకృతితో మానవ సంబంధాలకు, మహిళల ఐక్యతకు, తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రాచీన జానపద గాథల నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు తనదైన ప్రత్యేకతను చాటుకున్న బతుకమ్మ నేడు ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసే వేడుకగా విస్తరించింది. బతుకమ్మ ఆవిర్భావానికి సంబంధించి అనేక పౌరాణిక, జానపద గాథలు ప్రచారంలో ఉన్నాయి. గౌరీదేవి ఆరాధనతో పాటు వ్యవసాయం, వర్షాలు, ప్రకృతితో ముడిపడిన సంప్రదాయాలు ఈ పండుగలో కనిపిస్తాయి. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలను సుందరంగా పేర్చి పూజించడం ప్రకృతిని గౌరవించే తెలంగాణ ప్రజల జీవన విధానానికి నిదర్శనం. చెరువులు, కుంటల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులతో ఉన్న అనుబంధం కూడా ప్రతిబింబిస్తుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో బతుకమ్మ సాంస్కృతిక ఉద్యమానికి ప్రతీకగా మారింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటల ద్వారా తెలంగాణ భాష, సంస్కృతి, అస్తిత్వాన్ని చాటిచెప్పారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం దేశ, విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సైతం ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

బతుకమ్మ పండుగ తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో కొనసాగుతుంది. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే వేడుకల్లో అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ తదితర రోజుల్లో ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా వివిధ రకాల సద్దులు తయారు చేసి అమ్మవారికి నివేదిస్తారు. అనంతరం మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.

**టేకులపల్లి, గోలియ తండాలో ఘనంగా వేడుకలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని రామాలయ ప్రాంగణంలో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సంప్రదాయ పాటలు, ఆటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో గోలియ తండా సర్పంచ్ నాకా నాయక్, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఇల్లందు ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్, టేకులపల్లి ఎస్సై కె. తిరుపతి, చుక్కల బోడు సర్పంచ్ రామ, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ హర్సింగ్ నాయక్, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు భూక్య దల్ సింగ్ నాయక్, టీడీపీ సీనియర్ నాయకుడు గుడిపూడి మోహన్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడిపూడి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ గుడిపూడి కృష్ణ అర్జునరావు, మూడ్ సంజయ్, చిర్ర వెంకటయ్య, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.ప్రకృతిని పూజించడం, మహిళల ఐక్యతను చాటడం, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకోవడం బతుకమ్మ పండుగ ప్రధాన ఉద్దేశం. పూలతో ప్రారంభమై తెలంగాణ ప్రజల సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ ప్రాధాన్యం రోజురోజుకూ విస్తరిస్తోంది.

## బోడు గ్రామంలో ఘనంగా మూలవాసుల బతుకమ్మ సంబరాలు

**ప్రకృతి ఆరాధనతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పిలుపు**



**టేకులపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బోడు గ్రామంలో ఆదివాసీ మూలవాసుల బతుకమ్మ సంబరాలను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. కొమరం భీమ్ ఆశయ సాధన స్ఫూర్తితో స్థానిక ఆదివాసీ తుడుం దెబ్బ సంఘం నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్తులంతా ఏకమై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రకృతిని పూజించడం ఆదివాసీ మూలవాసుల జీవన విధానంలో అంతర్భాగమని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న తమ సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజన గూడేల్లో ఐక్యతను చాటుతూ ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ మహిళలు, యువతులు సంప్రదాయ, జానపద పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఆటపాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు గ్రామ ప్రజల్లో ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడు గ్రామ పెద్దలు, పటేళ్లు, తుడుం దెబ్బ సంఘం ప్రతినిధులు, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వైష్ణవి నర్సింగ్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి**



**ఖమ్మం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

ఖమ్మంలోని శ్రీ వైష్ణవి వొకేషనల్ నర్సింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఇనప నూరి పుల్లన్న మాట్లాడుతూ, విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడంతోపాటు పండుగలను నిర్వహించడం ద్వారా వాటి ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేయాలని సూచించారు. కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల చైర్మన్ మంత్రిపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, విద్యార్థుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ దొండేటి నరేశ్, ఉపాధ్యాయులు మనోజ్, నాగేంద్రమ్మ, జ్యోత్స్న, మధు, పుష్పరాజ్, ఉమా, విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం లక్ష్యం

**- అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమరెడ్డిని కలిసిన సీనియర్ నాయకుడు గంటల వెంకటాచారి**



**తల్లాడ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమరెడ్డిని తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంటల వెంకటాచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గంటల వెంకటాచారి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమరెడ్డి విజయానికి కుర్నవల్లి గ్రామంతోపాటు నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులందరం సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. విద్యావంతులు, యువత, పట్టభద్రులను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ సాధించేలా ప్రచారం నిర్వహిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐకేపీ కార్యాలయం కోసం తీసిన గుంతలను తక్షణమే పూడ్చాలి

**- తల్లాడలో ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్**

**- నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరిక**



**తల్లాడ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

తల్లాడ మండలంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పక్కన ఐకేపీ కార్యాలయ నిర్మాణం కోసం తీసిన గుంతలను తక్షణమే పూడ్చాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన వారు.. అక్కడ కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల అంబేద్కర్ భవనానికి వచ్చే వారికి ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, జాతీయ నాయకులు ఇశ్నేపల్లి అశోక్ మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు దారెల్లి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ.. అంబేద్కర్ భవనం పక్కన ఉన్న పరిమిత స్థలంలో మరో కార్యాలయ నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భవనంలోకి వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, గేటు ఏర్పాటు చేయాలని సూచించారు. ఐకేపీ కార్యాలయ నిర్మాణం కోసం తీసిన గుంతలను వెంటనే పూడ్చి, స్థలాన్ని యథావిధిగా ఉంచాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు మాదిగ, ఇశ్నేపల్లి వీరయ్య మాదిగ, దేవా తదితరులు పాల్గొన్నారు.

## రాత్రివేళల్లోనూ మేజర్లకు సాగునీటి విడుదల



**తల్లాడ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

తల్లాడ నీటిపారుదల శాఖ సబ్ డివిజన్-3 పరిధిలోని మండలంలోని అన్ని మేజర్లకు రాత్రివేళల్లోనూ సాగునీరు విడుదల చేస్తూ అధికారులు పర్యవేక్షించారు. డీఈ ఝాన్సీ, ఏఈ అరుణ ఆధ్వర్యంలో మేజర్లకు నీరు సక్రమంగా చేరేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లస్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూలూరుపాడులో కనువిందు చేస్తున్న బంతిపూల తోట!



**బతుకమ్మ వేళ పూల కొనుగోళ్లకు ప్రజల ఆసక్తి**

**ఐదు ఎకరాల్లో పూల సాగు..**

**కిలో రూ.100కే విక్రయం**

**జూలూరుపాడు, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

దసరా శరన్నవరాత్రుల వేళ.. తెలంగాణ ఆడపడుచుల బతుకమ్మ సంబరాలకు పూల పరిమళం తోడైంది. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు పట్టణంలోని బంతిపూల తోట చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రధాన రహదారికి సమీపంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన బంతిపూలు పసుపు, నారింజ రంగుల్లో విరబూసి ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. రహదారి పక్కనే ఈ తోట ఉండటంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

**బతుకమ్మకు బంతిపూలే ప్రత్యేక ఆకర్షణ**

తెలంగాణలో బతుకమ్మ పండుగకు పూలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలు పూజలు నిర్వహిస్తారు. దసరా పండుగ నేపథ్యంలో బంతిపూలకు డిమాండ్ పెరగడంతో జూలూరుపాడు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ తోటకు వచ్చి పూలను కొనుగోలు చేస్తున్నారు. బతుకమ్మ వేడుకలతోపాటు అయ్యప్ప స్వాముల పడిపూజలు, ఇతర శుభకార్యాలకు సైతం బంతిపూలను వినియోగిస్తున్నారు.

**కిలో రూ.100కే విక్రయం**

రైతు నీలాల చంటి ఐదు ఎకరాల్లో బంతిపూల సాగు చేపట్టారు. ప్రస్తుతం పూల దిగుబడి రావడంతో వినియోగదారులకు నేరుగా విక్రయిస్తున్నారు. కిలో బంతిపూలను సుమారు రూ.100 ధరకు అందిస్తున్నారు. పండుగ వేళ ప్రజలకు అందుబాటు ధరలో పూలను అందించాలనే ఉద్దేశంతో విక్రయాలు చేస్తున్నట్లు రైతు తెలిపారు.



**రైతుకు ఆదాయం.. ప్రజలకు అందుబాటులో పూలు**

పండుగల సమయంలో పూలకు పెరిగే డిమాండ్ రైతులకు ఆదాయ అవకాశాలను కల్పిస్తోంది. వినియోగదారులు నేరుగా తోట వద్దకు వచ్చి కొనుగోలు చేయడం వల్ల తాజా పూలు అందుబాటులోకి వస్తున్నాయి. బతుకమ్మ సంబరాల వేళ జూలూరుపాడులోని ఈ బంతిపూల తోట స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.బంతిపూలు కొనుగోలు చేయాలనుకునే వారు రైతు నీలాల చంటిని 9177419426 నంబర్‌లో సంప్రదించవచ్చు.

## శ్రీనగర్ కాలనీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు






**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

మండల పరిధిలోని శ్రీనగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా శనివారం ప్రారంభమయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మ (మొదటి రోజు) సందర్భంగా ఆ ప్రాంత మహిళలు ముందుగా వారి వారి ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా బతుకమ్మ అడ్డాకు చేరుకున్నారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. సంస్కృతి సాంప్రదాయాలతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సాగిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు నల్లూరి లావణ్య, సుభాషిని, సావిత్రి, మధులత, సంగీత, స్వప్న, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ విజయ విఘ్నేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

## శ్రీ స్వర్ణదుర్గ అమ్మవారి సన్నిధిలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



**కొత్తగూడెం, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి):**
కొత్తగూడెం పట్టణంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం శ్రీ స్వర్ణదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను నిర్వహించగా, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. నేటి నుంచి 20వ తేదీ వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ స్వర్ణదుర్గ అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కోరారు.

# అమ్మను కొలిస్తే అంతా శుభమే

## డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

## శివనగర్‌లో అమ్మవారి ఆగమన కార్యక్రమం



**పాల్వంచ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**
అమ్మలను కన్న అమ్మ పెద్దమ్మను కొలిచి, పూజిస్తే అంతా శుభమే జరుగుతుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని పాల్వంచ పట్టణ పరిధిలోని శివనగర్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ దుర్గా సేవా సమితి (శివనగర్ యూత్ సర్కిల్) ఆధ్వర్యంలో అమ్మవారి మండపాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి అమ్మవారి ఆగమన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు హారతులు పట్టుకుని ఊరేగింపుగా అమ్మవారికి స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, నిర్వాహకులు శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు సంతోష్ రెడ్డి (బబ్లు), శ్రీరాం, సాయి, ప్రకాష్, గణేష్, బేతంశెట్టి విజయ్, చిన్నపండు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కఠిన నిర్ణయం సరికాదు

## తక్కల్లపల్లి రవీందర్ రావు

**నర్సంపేట, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



నర్సంపేట లోని ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయడంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న కలెక్టర్ వ్యవహారం సరైనది కాదని తద్వారా సాధారణ మధ్యతరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ పిఎసిఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ తక్కల్లపల్లి రవీందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎక్కడలేని నిబంధనలను నర్సంపేటకు అమలు చేస్తూ ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వకుండా సుమారు రెండు సంవత్సరాల నుండి కలెక్టర్ తాత్సరం చేయడం సరికాదన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆక్ట్ ప్రకారం అనుమతులు ఇవ్వడం మంచిదే కానీ కఠిన నిర్ణయాలను అమలు చేయడం మూలంగా సాధారణ మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గమనించాలని వారు కోరారు. రాష్ట్రంలో ఎక్కడ ఆసుపత్రులు లేనట్లు డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్ట్ వాటికి వర్తించినట్లు నర్సంపేటకు మాత్రమే వర్తిస్తున్నట్లు కలెక్టర్ ప్రవర్తించడం సమంజసం కాదని ఫైర్ ఎన్ఓసి ఫైర్ ఆడిట్ సర్టిఫికెట్లు భవన నిర్మా ణాలను పైన ఆధారపడి ఉంటాయని సదరు భవన నిర్మాణాలు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అనుమతులతో నిర్ణయిస్తారని గమనించాలని వారు కోరారు. నిబంధనలను అమలు చేయాలంటే అది ప్రజలకు ఇబ్బంది కాకుండా ఉండాలని ప్రజలు ఇబ్బంది పడితే ప్రజాపాలన ఎలా అవుతుందని వారు కలెక్టర్ ను ప్రశ్నించారు. ఆసుపత్రుల అనుమతుల విషయంలో నర్సంపేట డాక్టర్లు ఒక నిర్ణయం ప్రకటించాలని వారు తీసుకునే నిర్ణయాలకు బి ఆర్ ఎస్ పార్టీ సహకారం అందిస్తుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రులన్నీ కూడా నర్సంపేట గ్రామపంచాయతీ గా ఉన్న సమయంలో నిర్మించారని, అప్పటి నిబంధనల మేరకే భవనాలునిర్మితమయ్యాయని గమనించాలని వారు కోరారు.ఆసుపత్రుల పై పోలీస్ విచారణ జరపడం దారుణమని అన్నారు.ఏది ఏమైనప్పటికి ఆస్పత్రుల అనుమతులు మంజూరు చేయడంలో కలెక్టర్ అవలంబిస్తున్న కఠిన ధోరణి మూలంగా సాధారణ మధ్యతరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి అందకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా ఆస్పత్రులపైకి కోపంతో దాడులకు సైతం దిగుతున్నారని వారు అన్నారు. కలెక్టర్ ఈ విషయం పట్ల సానుకూలంగా స్పందించి ప్రైవేట్ ఆస్పత్రులకు అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. నర్సంపేట పరిసర ప్రాంతాలంతా పేద మధ్యతరగతి కుటుంబాలు జీవనం సాగిస్తూ ఉంటాయని, వారికి ఏ రకమైన ఆరోగ్య సమస్యలు వచ్చిన నర్సంపేట పట్టణంలో ఉన్న ఆస్పత్రులను ఆశ్రయిస్తారని, వారికి అయిన కనీస ఆసుపత్రి ఖర్చులను ప్రభుత్వం నుండి పొందే అవకాశం లేకుండా కలెక్టర్ చేయడం ఒకింత బాధాకరమైనప్పటికీ ఈ వ్యవహారంలో డాక్టర్లను దోషులుగా చిత్రికరించడం తో పాటు ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారు ఆరోపించారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత ముఖ్యమంత్రి సహాయనిధి అందడం లేదని ప్రజలు వాపోతున్న తీరు బాధాకరమని వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ అంశాన్ని పరిష్కరించాలని తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు..కలెక్టర్ ఈ విషయం పట్ల స్పందించకపోతే రాష్ట్ర అధినాయకత్వానికి ఈ సమస్యను వివరించి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యాచరణను సిద్ధం చేసి, ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చూస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.

# విద్యుత్ కార్మిక సంఘం హెచ్-58 రీజినల్ నూతన కమిటీ ఎన్నిక

## - అధ్యక్ష, కార్యదర్శులుగా రాసూరి శ్రీనివాస్, మహమ్మద్ పఠాన్ ఖాన్ ఏకగ్రీవ ఎన్నిక



**పాల్వంచ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) హెచ్-58 రీజియన్‌కు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం కేటీపీఎస్ టీఆర్‌వీకేఎస్ ప్రాంతీయ కార్యాలయంలో జెన్‌కో కార్యదర్శి ముత్యాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో కేటీపీఎస్ ఐదో, ఆరో దశల రీజినల్ అధ్యక్షుడిగా రాసూరి శ్రీనివాస్, కార్యదర్శిగా మహమ్మద్ పఠాన్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఇంతకాలం అధ్యక్ష, కార్యదర్శులుగా బాధ్యతలు నిర్వహించిన కురిమెళ్ల రవికుమార్, ఎం.డి. సుభానిని చారుగుండ్ల రమేష్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా చారుగుండ్ల రమేష్ మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులు కేటీపీఎస్ ఐదో, ఆరో దశల్లో పనిచేస్తున్న టీఆర్‌వీకేఎస్ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూ చించారు. కార్మికులందరినీ కలుపుకొని సంఘ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ కాంప్లెక్స్‌కు చెందిన రాష్ట్ర, జెన్‌కో, రీజినల్, బ్రాంచ్, ఆర్టిజన్ నాయకులతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రుద్రంపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



## - సంప్రదాయబద్ధంగా వేడుకలను ప్రారంభించిన ఐఎన్‌టీయూసీ నేత రజాక్



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**
చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎం.డి. రజాక్ ముఖ్య అతిథిగా హాజరై సంప్రదాయబద్ధంగా వేడుకలను ప్రారంభించారు. ఎస్ఏ-1 పరీక్షల చివరి రోజు అయినప్పటికీ విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో అలంకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన రజాక్ వేడుకల్లో పాల్గొనడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు దసరా బోనస్ రూ.25 వేలు చెల్లించాలి



## - పండుగకు వారం రోజుల ముందే బోనస్ అందించాలి

## - ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య డిమాండ్

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**
సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు దసరా బోనస్‌గా కనీసం రూ.25 వేలు చెల్లించాలని, పండుగకు వారం రోజుల ముందుగానే ఆ మొత్తాన్ని అందించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు కె.డబ్ల్యూ. క్రిస్టోఫర్ డిమాండ్ చేశారు. లాభాల వాటా నిర్ణయించడంలో, కాంట్రాక్ట్ కార్మికులకు దసరా బోనస్ చెల్లించడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ శనివారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలోని బంగ్లాస్ గేటు వద్ద కాంట్రాక్ట్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సాధించే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ కీలకమని పేర్కొన్నారు. అయితే గత రెండేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు నామమాత్రంగా బోనస్ చెల్లిస్తున్నారని, అది కూడా సకాలంలో అందడం లేదని విమర్శించారు. సింగరేణి నిధులను ఇతర ప్రాంతాలకు, ఇతర అవసరాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆరోపించిన నాయకులు, కష్టపడి పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల బోనస్ విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. గతంలో దసరాకు ఒక్కరోజు ముందు కాంట్రాక్టర్ల ఖాతాల్లో బోనస్ జమ చేయడం వల్ల బ్యాంకు సెలవుల కారణంగా చాలామంది కార్మికులకు పండుగకు ముందే డబ్బులు అందడం లేదని తెలిపారు. ఈసారి కనీసం రూ.25 వేల బోనస్‌ను వెంటనే నిర్ణయించి, పండుగకు వారం రోజుల ముందుగానే కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల ద్వారా బోనస్ చెల్లింపుల్లో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా యాజమాన్యం పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి. రంజిత్, చుక్కయ్య, సురేష్, ఆదిలక్ష్మి, సుజాత, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, రాము, రమేష్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయానికి రూ.1.50 లక్షల విరాళం

## - భారీ విరాళం అందించిన కాంగ్రెస్ యువజన నాయకుడు అడపా అనిల్ చౌదరి



**తల్లాడ, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**
తల్లాడ మండలం నూతనకల్లు గ్రామంలోని శ్రీ శివగిరి మణికంఠ క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ యువజన నాయకుడు అడపా అనిల్ చౌదరి రూ.1.50 లక్షల విరాళాన్ని అందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు చేయూతనివ్వడంతో పాటు ఆలయ అభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో ఈ విరాళం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అడపా అనిల్ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు వీరబాబు ముదిరాజ్, ఎస్.కె. నాగులు మీరా, కాంగ్రెస్ నాయకులు గోగుల వెంకటయ్య, కల్యాణపు వెంకటయ్య, మధు, తోట శ్రీకాంత్, చెడె వెంకన్న, నాయకులు నాయుడు శ్రీను, పసుపులేటి ప్రభాకర్, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కాశీ విశ్వనాథ ఆలయంలో గోదావరి అంజిరెడ్డి ప్రత్యేక పూజలు



**తెల్లాపూర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఉస్మాన్‌నగర్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ శివ పంచాయతన దేవాలయాన్ని సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతగిరిపల్లె ప్రేమ్ కుమార్, కుమ్మరి అనిల్, వెంకట్ రెడ్డి, కుమ్మరి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్స్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ





**ఉస్మాన్‌నగర్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఉస్మాన్‌నగర్‌లోని ఇండస్ క్రెస్ట్ అపార్ట్‌మెంట్స్‌లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అపార్ట్‌మెంట్ వాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు సైతం వేడుకల్లో పాల్గొనడంతో అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఐకమత్యంతో వేడుకలను విజయవంతం చేసిన అపార్ట్‌మెంట్ వాసులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# గూడెంలో మొదలైన బతుకమ్మ సంబురాలు

## ఎంగిలిపూల బతుకమ్మతో పండుగ శోభ..

## పూలతో కళకళలాడిన వాడలు







**కొత్తగూడెం, అక్టోబర్ 10, (తెలంగాణ వాణి)**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు రామవరంలో ప్రారంభమయ్యాయి. శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో తొలిరోజు వేడుకలు మొదలుకావడంతో ప్రాంతంలో పండుగ సందడి నెలకొంది. తెలంగాణ ఆడపడుచులు ప్రకృతిలో లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి, జానపద పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూల పండుగతో జిల్లా కేంద్రం కొత్తగూడెంలో పరిసరాలు సందడిగా మారాయి. తెలంగాణ అస్తిత్వానికి, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఏడాది తొమ్మిది రోజుల పాటు భక్తి, ఆనందోత్సాహాల మధ్య నిర్వహిస్తారు. ప్రకృతిని ఆరాధిస్తూ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇరుగుపొరుగు వారితో కలిసి జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది.
ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా కొనసాగనున్నాయి. చివరి రోజైన సద్దుల బతుకమ్మతో పూల పండుగ ముగియనుంది.

RNI NO:APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం , అక్టోబర్ 11 , 2026

# జర్నలిస్టుల ప్రాతినిధ్యంపై ఉత్కంఠ

**- కోర్టు ధిక్కరణ పిటిషన్‌కు సిద్ధం**

**- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నిర్ణయం**

**హైదరాబాద్, అక్టోబర్ 10 (తెలంగాణ వాణి)**

మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపిస్తూ, కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసేందుకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సిద్ధమవుతున్నారు.

రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తమ సంఘానికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని ఆగస్టు 3న ఆదేశించినట్లు సంఘం వర్గాలు తెలిపాయి. ఆరు వారాల్లోగా ఆదేశాలను అమలు చేయాలని గడువు విధించినప్పటికీ, గడువు ముగిసినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని పేర్కొన్నాయి.

**అధికారులపై కోర్టు ధిక్కరణ పిటిషన్?**

హైకోర్టు ఆదేశాల అమలులో జాప్యం జరగడంపై మామిడి సోమయ్య అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను నిర్దేశిత గడువులోగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బాధ్యులైన అధికారులను ప్రతివాదులుగా చేర్చి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసేందుకు న్యాయవాదులు ముసాయిదా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఈ పిటిషన్‌లో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో పాటు జిల్లాల సమాచార, పౌర సంబంధాల అధికారులను ప్రతివాదులుగా చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**జర్నలిస్టుల ప్రాతినిధ్యంపై ఉత్కంఠ**

మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించే అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైతే తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తుందా? లేదా ఈ వ్యవహారం కోర్టు ధిక్కరణ విచారణ వరకు వెళ్తుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.